క్లుప్తంగా

కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఎమ్మెల్యే సునీతారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం కేటీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని సునీతారెడ్డి హైదరాబాద్‌లో ఆయనను కలిసి శాలువాతో సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

నానో ఎరువులపై అవగాహన



నానో ఎరువులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

నిజాంపేట(మెదక్): వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అలవర్చుకోవాలని ఇన్‌చార్జి వ్యవసాయ సంచాలకులు రాజ్ నారాయణ తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని కల్వకుంటలో రైతు క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. అతి తక్కువ ఖర్చుతో ద్రవ రూప ఎరువులు వాడడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, పి శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్.చిత్తరంజన్ దాస్, గోపాల్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



వివరిస్తున్న ఇక్రిశాట్ బృందం సభ్యులు

హవేళిఘణాపూర్(మెదక్): భూసార పరీక్షల గురించి ఇక్రిశాట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హవేళిఘణాపూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సేకరించిన మట్టి నమూనాను పరీక్షించి ఎలాంటి మోతాదులో మందులు వాడాలో అని రైతులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మధుమోహన్, హెచ్‌ఎం కరుణాకర్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని మల్కాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. మండలంలోని నర్సంపల్లికి చెందిన ధరావత్ శ్రీనివాస్(28) కొంత కాలంగా కుటుంబ సభ్యులతో కలిసి మల్కాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ, ఇతర అవసరాలకు అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చే మార్గంకానరాక తీవ్ర మనస్తాపం చెందాడు. గత శనివారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

వంటల్లో నాణ్యత పాటించండి



వంటలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

కంగ్టి(నారాయణఖేడ్): విద్యార్థులకు వండుతున్న వంటల్లో నాణ్యత పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల కేంద్రం కంగ్టిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వండిన వంటలను ఆకస్మికంగా ఎంపీఓ సుభాష్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. వంట గది పరిశుభ్రంగా ఉంచాలని.. కురగాయలు, ఆకుకూరలు, గుడ్లు, మాంసం తాజాగా ఉన్నవి మాత్రమే వంటలకు వాడాలని తెలిపారు. అనంతరం విద్యాలయంలోని రికార్డును పరిశీలించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారం నుంచి బయట పడేదెలా..?

- పంచాయతీల నిర్వహణ భారం తడిసి మోపెడు
- ఏడాదిన్నరగా అప్పులు చేస్తున్న కార్యదర్శులు
- ప్రభుత్వ పెద్దల బెదిరింపులతో పోరాటానికి వెనుకడుగు
- 'స్థానిక' ఎన్నికలే సమస్యకు పరిష్కారమని భావన



మెదక్‌జోన్: జిల్లాలో పంచాయతీ కార్యదర్శులకు విచిత్ర పరిస్థితి నెలకొంది. పంచాయతీల నిర్వహణ భారం తడిసి మోపవడం.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఏమి చేయాలో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తమారైంది. ఈ సమస్యకు పరిష్కారం కేవలం స్థానిక సంస్థల ఎన్నికలేనని వారు భావిస్తున్నారు. దీంతో ఈ ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థల పాలక వర్గాలు కొలువుదీరితే.. ఆర్థిక పరమైనా సమస్యల నుంచి బయట పడే అవకాశం లేకపోలేదని వారు భావిస్తున్నారు. 2024 ఫిబ్రవరిలో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. అప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులే అప్పులు చేసి చెత్త సేకరించే వాహనాల్లో డీజిల్ పోస్తున్నారు. అధికారికంగా ఏ కార్యక్రమం నిర్వహించినా అందుకు అవసరమైన నిర్వహణ పూర్తిగా కార్యదర్శులే చూసుకోవాల్సిన పస్థితి నెలకొంది. గడిచిన 18 నెలల నుంచి ఒక్కో కార్యదర్శి రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు అప్పులు చేసి డీజిల్ కొనుగోళ్లు, విద్యుత్ బల్బుల నిర్వహణ, పల్లెల్లో నల్లా పైపులైన్లు పగిలినా, మోటర్లు కాలినా వాటి మరమ్మతులను చేసేందుకు సొంతంగా డబ్బులు వెచ్చిస్తూ అప్పులపాలవుతున్నారు.

పోరాటాలకు సిద్ధమైనా కార్యదర్శులు

ఆర్థిక పరమైనా పనులు నిర్వహించలేమని, చెత్త ట్రాక్టర్లలో డీజిల్ పోయటం తమతో కాదని కార్యదర్శులు వాటి తాళాలను సైతం అధికారులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు జూన్ మాసంలో ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యారు. 15 అంశాలతో కూడిన వినతి పత్రాలను కలెక్టర్లకు, ఇతర ప్రజాప్రతినిధులకు అందించారు. పోరాటం చేసేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో జాయింట్ యాక్షన్ కమిటీని (జేఏసీ) సైతం ఏర్పాటు చేశారు. జూన్‌లో 15 రోజుల పాటు పలు డిమాండ్లను నెరవేర్చాల్సిందేనని పోరాటానికి సన్నద్ధమయ్యారు. కానీ ప్రభుత్వ పెద్దల నుంచి బెదిరింపులు రావటంతో వెనుకడుగు వేశారు.

పాలక పక్షం లేక నిధులు రాక..

18 నెలల పాటు పాలకపక్షం లేక పోవటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీల నిర్వహణ గాలికొదిలేశాయి. 2024 జూలైలో కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన ఒక్కో పంచాయతీకి సుమారు రూ.10 వేల చొప్పున విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో స్వచ్ఛదనం.. పచ్చదనం కింద ఒక్కో పంచాయతీకి రూ.50 వేల చొప్పున విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ వాటిని ట్రెజరీకి పంపితే పైసా విడుదల కాలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారా, తమకు ఇబ్బందులు ఎప్పుడు తొలగిపోతాయా అంటూ వారు ఎదురు చూస్తున్నారు.

వార్డుల వారీగా విభజన చేయండి



కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

శివ్వంపేట(నర్సాపూర్): ఓటరు లిస్టులోని పేర్లను గ్రామాల వారీగా విభజన చేయాలని ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ అన్నారు. గ్రామ పంచాయతీల ఓటరు లిస్టు నమోదుకు సంబంధించి గురువారం పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టాలని కార్యదర్శులకు ఆదేశించారు. రానున్న స్థానిక ఎన్నికలకు సంబంధించి ఓటరు లిస్టును సమగ్రంగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది స్వామి, నరేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



మనోహరాబాద్(తూప్రాన్):తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



కౌడిపల్లి(నర్సాపూర్): తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ మండల కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాటసమితి, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. పీఆర్‌సీ నివేదికను వెలువరించి జూలై 2023 నుండి వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలన్నారు.

నిర్లక్ష్యం తగదు

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని టీపీటీఎఫ్, యూటీఎఫ్ సంఘాల నాయకులు ఆరోపించారు. గురువారం వారి సమస్యలపై తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్షణమే బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని, పెండింగ్ డీఏ, బిల్లులు విడుదల చేయాలని కోరారు.

కౌడిపల్లి తహసీల్ కార్యాలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): విద్య, ఉపాధ్యాయ రంగంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగులమీరా అన్నారు. గురువారం కౌడిపల్లి తహశీల్ కార్యాలయంలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో డిమాండ్ల కూడిన వినత్రిపత్రాన్ని తహసీల్దార్ కృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ తక్షణమే విడుదల చేయాలని. జీఓ 25 ను సవరించి, ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

చేగుంట తహసీల్దార్ కార్యాలయంలో..

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు నర్సింహారావు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు, సీపీఎస్ రద్దు, జీఓ 317తో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

మాసాయిపేట తహసీల్దార్ కార్యాలయంలో ..

వెల్దుర్తి(తూప్రాన్): ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాసాయిపేట మండల టీపీటీఎఫ్ అధ్యక్షుడు మహబూబ్ బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మాసాయిపేట తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం దశల వారిగా ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు.

ఇద్దరు టీచర్లు ఉండాలి

నర్సాపూర్: జీఓ నంబర్ 25ను సవరించి ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని టీఎస్ యూనైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందచేసిన అనంతరం మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూలును తక్షణమే విడుదల చేయాలన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం



ఊడిన పెచ్చులను శుభ్రం చేస్తున్న ఆయా

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కుకుట్లపల్లిలో అంగన్‌వాడీ భవనం పైకప్పు పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఆ సమయంలో పిల్లలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం అంగన్‌వాడీ ఆయా బిస్మిల్లా కేంద్రాన్ని తెరచి శుభ్రం చేస్తుండగా పైకప్పు పెచ్చులూడిపడ్డాయి. దీంతో ఆందోళనకు గురైన ఆయా బయటకు వచ్చి.. కింద పడ్డ పెచ్చులను తొలగించింది. అంగన్‌వాడీ కేంద్రం గ్రామంలోని ఓ కమ్యూనిటీ భవనంలో కొనసాగుతోంది. ఇప్పటికే శిథిలావస్థలో ఉన్న భవనం, రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పైకప్పు పెచ్చులూడిపడ్డాయి. ఇక్కడ అంగన్‌వాడీ టీచర్ పోస్ట్ ఖాళీ ఉండగా, బుజురంపేట్ టీచర్ సద్గుణ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తుంది. ఈ కేంద్రంలో 20 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జీఐఎస్‌తో అనేక ప్రయోజనాలు



ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న స్థానిక కాలేజీ ప్రతినిధులు

నర్సాపూర్: జియో గ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్)తో ఆయా రంగాల్లో అనేక ప్రయోజనాలు ఉంటాయని హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ కేబీవీఎన్ ఫణీంద్ర చెప్పారు. స్థానిక బీవీరాజు ఇంజనీరింగ్ కాలేజీలో అప్లికేషన్స్ ఆఫ్ జీఐఎస్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్ అంశంపై వారం రోజులుగా కొనసాగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమం గురువారం ఏర్పాటు చేయగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జలవనరుల్లో జీఐఎస్ వినియోగం అంశంపై ఫణీంద్ర ప్రసంగించి ఫ్యాకల్టీకి ఉపయోగపడే పలు అంశాలు వివరించారు. అనంతరం ఫణీంద్రను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, హెచ్ఓడీలు శ్రీకృష్ణారావు, మురళీకృష్ణ, మేనేజర్ బాపిరాజు, ఏఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

పెద్దశంకరంపేట(మెదక్): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్కాపూర్‌లో మహిళలకు మొక్కలు పంపిణీ చేసిన అనంతరం గ్రామస్తులు, అధికారులతో కలిసి మొక్కలను నాటారు. వనమహోత్సవంలో భాగంగా అన్ని గ్రామాలలో మొక్కలను నాటాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ సంతోష్‌కుమార్, ఈసీ నవాజుద్దిన్, టీఏ మోహన్, ఫీల్డ్‌అసిస్టెంట్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

'యోగాసన' ఉపాధ్యక్షుడిగా గణేశ్



గణేశ్‌రవికుమార్

చేగుంట(తూప్రాన్): యోగాసన రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా చేగుంటకు చెందిన గణేశ్‌రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రావు, కృపాకర్‌లు ప్రకటించారు.ఇరవై సంవత్సరాలుగా చేగుంట కేంద్రంగా మెదక్ జిల్లా నుంచి వందలాది మందిని రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఆయన తీర్చిదిద్దారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

అల్లాదుర్గం(మెదక్): విద్యారంగా, ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ అల్లాదుర్గం మండల శాఖ అధ్యక్షుడు బాలకిష్టయ్య డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ మల్లయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నుంచి పీఆర్‌సీ ప్రకటించాలని, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్హేర్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి సూచించారు. గురువారం విలేకరులతో మాట్లడుతూ.. మరో రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఎవరు ఉండొద్దని చెప్పారు. మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు షార్ట్ సర్క్యూట్ వచ్చే అవకాశం ఉన్నందున వాటికి దగ్గరగా మనుషులు వెళ్లొద్దని, పశువులను కూడా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే డయల్ 100కి ఫోన్ చేస్తే సహాయాన్ని అందిస్తారని తెలిపారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ

వట్‌పల్లి(అందోల్): మండలంలోని కేరూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బురగళ్ల కుమార్ ఆధ్వర్యంలో 70మంది విద్యార్థులకు ఉచితంగా బూట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల విద్యాభ్యాసానికి తో డ్పాటునందించాలనే సంకల్పంతో షూ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణకుమారి, మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్, నాయకులు ప్రభాకర్, వెంకట్‌గౌడ్, మాణిక్యం, యాదగిరి, రమేశ్ పాల్గొన్నారు.

బగలాముఖీ శక్తిపీఠంలో హోమం



మహామంత్ర హోమం నిర్వహిస్తున్న వేద పండితుడు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. బగలాముఖీ ఉపాసకులు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హోమం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గురుపీఠంలో పూజలు

గూడూర్‌లోని గురుపీఠంలో గురువారం పూజ కార్యక్రమాలు చేపట్టారు. దత్తాత్రేయస్వామి, సాయిబాబాలకు ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు పలువురు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



మాట్లాడుతున్న క్రాంతి కిరణ్

అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

టేక్మాల్ (మెదక్): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. గురువారం మండలంలోని బొడ్మట్‌పల్లిలో కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరినీ గౌరవించే పార్టీ బీఆర్‌ఎస్ అని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించింది బీఆర్‌ఎస్ అని అన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందన్నారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లిలో ఎస్‌ఎస్‌జీ బృందం తనిఖీ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న రాణి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో స్వచ్ఛ భారత్ (ఎస్‌ఎస్‌జీ) స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ స్టేట్ ఆర్‌పి రాణి గ్రామంలోని పారిశుధ్య, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీ, బస్టాండ్‌లో గల టాయ్‌లెట్స్ వినియోగం తదితర విషయాల గురించి ఎంపీడీఓ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె గ్రామంలో పర్యటించి, మరుగుదొడ్ల వినియోగం గురించి ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఏపీఓ పుణ్యదాస్, కారోడర్ ఎల్లం పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న ఏఓ రాజశేఖర్‌గౌడ్, ఏఎస్‌ఐ రాములు

చిలప్‌చెడ్(నర్సాపూర్): డీలర్లు, ఫర్టిలైజర్ దుకాణా యజమానులు, ఎరువుల విక్రయాల విషయంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం చిలప్‌చెడ్ మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలలో వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంఆర్‌పీ ధరకే ఎరువులు అమ్మాలన్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రశీదు తీసుకోవాలని సూచించారు. కృత్రిమ యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాములు ఉన్నారు.

అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న డా.కల్పన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనలో భాగంగా గురువారం బండ్లగూడ పరిధి పెన్నార్ పరిశ్రమలోని సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా. కల్పనా పాల్గొని ఫైలేరియాపై అవగాహన కల్పించారు. ఆగస్టు 10 నుంచి 25 వరకు ఫైలేరియా, నులి పురుగుల నిర్మూలన కోసం ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

అల్లుకుంటున్న ప్రమాదం



అల్లాదుర్గం శివారులో 161 రహదారి పక్కన స్తంభం పైకి అల్లుకున్న తీగలు

విద్యుత్ స్తంభం ఎత్తు వరకు తీగలు అల్లుకున్నాయి. ప్రస్తుత వర్షాకాలంలో ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోవడం లేదు. అల్లాదుర్గం, గడిపెద్దాపూర్ శివారులో 161 రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలకు పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. స్తంభానికి విద్యుత్ తీగలు అల్లుకున్నాయి. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదని, హైవే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలకు అల్లుకుంటున్న తీగలను తొలగించాలని కోరుతున్నారు.

– అల్లాదుర్గం(మెదక్):

సంక్షిప్త వార్తలు

◆ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నర్సాపూర్: నర్సాపూర్‌లోని నగల దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని యజమానులకు సీఐ జాన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని నగల దుకాణాల యజమానులతో బుధవారం రాత్రి సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేశారు. ప్రతి దుకాణం వద్ద సీసీ కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులు పెట్టుకోవాలని, అపరిచిత వ్యక్తులు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. సమావేశంలో ఎస్‌ఐ లింగం తదితరులు పాల్గొన్నారు.

◆ ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీ

పెద్దశంకరంపేట(మెదక్): ఎమ్మార్పీఎస్ పెద్దశంకరంపేట గ్రామ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి సుధాకర్ ఆధ్వర్యంలో పెద్దశంకరంపేట గ్రామ కమిటీ అధ్యక్షులుగా నాందేడ్ కిషన్, ఉపాధ్యక్షులుగా నరేష్, అధికార ప్రతినిధిగా మహేష్, ప్రచార కార్యదర్శిగా శివ, కోశాధికారిగా ఆదిత్య, సహాయ కార్యదర్శిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా నాందేడ్ నాగరాజులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దుర్గాప్రసాద్, జోగు సాయిలు, బాలయ్య, శంకర్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉషానాగళ్ల మురళి తదితరులున్నారు.